ఉద్యోగుల కదలికపై నిఘా..

- అభ్యర్థులకు మద్దతు ఇస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వ ఉద్యోగులకు నియమావళిపై సూచనలు
- సిద్ధిపేట సంఘటన దృష్ట్యా జిల్లాలో అప్రమత్తం


సార్వత్రిక ఎన్నికల శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు (ఫైల్)

చుంచుపల్లి: ఎన్నికలు ఏవైనా వాటి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఎన్నికల కోడ్ అమలు దగ్గర నుంచి ఫలితాలు ప్రకటించే వరకు అప్రమత్తంగా ఉంటూ పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. ఇదే తరహాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఏ రాజకీయ పార్టీకి గానీ, అభ్యర్థికి గానీ మద్దతు తెలపకుండా విధులను అత్యంత పారదర్శకంగా నిర్వర్తించాలనే నిబంధనలు కూడా వర్తిస్తాయి. వీటిలో ఎక్కడైనా ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సంఘం వారిపై నిర్దాక్షిణ్యంగా వేటు వేస్తుంది. ఇటీవల సిద్ధిపేటలో ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి సమావేశానికి హాజరైనందుకు గానూ ఏకంగా 106 మంది ఉపాధి హామీ, సెర్ప్ విభాగాలకు చెందిన ఉద్యోగులపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఈ విషయంలో వివిధ పార్టీలు ఆధారాలతో ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నిఘా బృందాలు కొన్ని గంటల్లోనే సమావేశానికి హాజరైన ఉద్యోగుల వివరాలు సేకరించాయి. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఒక పార్టీకి చెందిన అభ్యర్థి సమావేశానికి వెళ్లిన ఎక్కువ మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేయడంతో ఈ విషయం అంతటా చర్చనీయంగా మారింది. ఈ ఘటనతో అప్రమత్తమైన ఎన్నికల సర్వేలెన్స్ బృందాలు జిల్లాలోనూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కదలికలపై నిఘా పెంచాయి. ప్రభుత్వ ఉద్యోగులు రోజు వారీ నిర్వహిస్తున్న విధులు, బయట చేపడుతున్న ఇతర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇప్పటికే జిల్లా అధికారులు సంబంధిత శాఖల ఉద్యోగులకు జాగ్రత్తగా ఉండాలని వాట్సప్ గ్రూపుల్లో హెచ్చరికలు సైతం జారీ చేశారు. కొత్తగూడెం నియోజవర్గ పరిధిలో సుమారు 2,800 మంది ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. ఇందులో నుంచి ఈ సార్వత్రిక ఎన్నికల కోసం 1,200 మంది సిబ్బందికి బాధ్యతలు కేటాయించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే వేటే...

18వ లోక్‌సభ ఎన్నికలు తెలంగాణలో వచ్చే మే 13న జరగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖమ్మం, మహబూబాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో విస్తరించి ఉంది. ఇందులో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్‌లో ఉండగా, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోకి వస్తాయి. ఇక ఎన్నికల వేళ ఉద్యోగులు ఒక పార్టీకి లేదా వ్యక్తికి కొమ్ము కాసేలా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంది. ఎన్నికల సమయంలో ప్రత్యేక నిఘా బృందాలతో పర్యవేక్షిస్తుంది.

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటస్టిక్ సర్వేలెన్ బృందాలు, వీడియో సర్వేలెన్స్ ప్రత్యేక బృందాలను జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంచింది. ఇక వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేసే ఉద్యోగులు, ఇతర సిబ్బంది రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలను 1949 సెప్టెంబరు 17 నుంచి అమల్లోకి తెచ్చారు. సెక్షన్ 23 (ఐ) ప్రకారం వారంతా ఎన్నికల కోడ్‌పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వివిధ కార్పొరేషన్, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే అన్ని స్థాయిల ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ పారదర్శకంగా వ్యవహరించాలి. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతీ అధికారి, ఉద్యోగి తనవంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. ఎలాంటి పక్షపాతాన్ని చూపించకూడదు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఒక అభ్యర్థికి సహకరిస్తున్నారనే చిన్నపాటి ఆధారాలు దొరికినా వేటు పడుతుంది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులను చూసి ఒక పార్టీకి అనుకూలంగా ప్రభుత్వ ఉద్యోగి కామెంట్‌లు పెట్టినా చర్యలుంటాయి. ముఖ్యంగా ప్రచార సభల్లో పాల్గొనడం. అంతర్గతంగా తమ నేత అని ప్రచారం చేయడాన్ని కూడా తీవ్రంగా పరిగణిస్తారు. ఉద్యోగులు తమ సొంతూళ్లలోనూ పార్టీ కండువాలు వేసుకుని ప్రచారం చేయడం లేదా రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం వంటివి చేయకూడదు. తన కింది స్థాయి సిబ్బందిని కానీ, గ్రామాల్లో ఓటర్లను కానీ ఒక పార్టీకి సహకరించి ఓటెయ్యాలని సూచించవద్దు.

నియమావళి పాటించాలి..



ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఎన్నికల నియమాళిని కచ్చితంగా పాటించాలని జిల్లా అధికారుల సూచనల మేరకు ఆదేశాలు ఇచ్చాం. సిద్ధిపేట ఘటన నేపథ్యంలో ఉద్యోగులకు వాట్సప్ గ్రూపుల ద్వారా సమాచారం ఇస్తూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు ప్రత్యేక నిఘాతో పని చేస్తున్నందున ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– గుంటి సత్యనారాయణ, ఎంపీఓ

తాగునీటి సదుపాయం కల్పించండి..

ఇల్లెందు: గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ కోరారు. శుక్రవారం ఇల్లెందులో సీపీఎం మండల కమిటీ సమావేశం కూకట్ల శంకర్ అధ్యక్షతన జరిగింది. రమేష్ మాట్లాడుతూ.. గుడిసెవాసుల కాలనీలకు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. గిరిజనులకు రెండో పంటగా భావించే తునికాకు సేకరణ రేటు పెంచాలని కోరారు. 50 ఆకుల కట్ట ధర రూ.1.50 పెంచాలని, బోనస్ బకాయిలు చెల్లించాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నబీ, కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, శంకర్, ఖాదర్, సర్వాన్, మునిగంటి లక్ష్మి, సంధ్యారాణి పాల్గొన్నారు.

26 నుంచి శిక్షణ తరగతులు

పాల్వంచరూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక బొల్లోరిగూడెంలోని శిశుమందిర్ పాఠశాలలో ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా కార్యవాహ మేదరమెట్ల పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతుల్లో నిత్య జీవితంలో దేశభక్తి, క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, సంస్కృతుల పట్ల అవగాహన పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు.

ఖమ్మం తరలిన బీజేపీ శ్రేణులు

జూలూరుపాడు: బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఖమ్మం తరలివెళ్లారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆధ్వర్యంలో.. జూలూరుపాడులో ర్యాలీ నిర్వహించిన అనంతరం వాహనాల్లో ఖమ్మం బయలుదేరారు. అంతకముందు రమేష్ మాట్లాడుతూ... బీజేపీ ఆధ్వర్యంలో ఎన్‌డీఏ కూటమి పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు సాధించడం ఖాయమన్నారు.

మల్లన్నకు నివాళి

టేకులపల్లి: బోడు పంచాయతీ కొత్తగూడెం గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ గ్రామ కమిటీ సభ్యుడు పూనెం మల్లయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహంపై న్యూడెమోక్రసీ బోడు కొత్తగూడెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పూనెం రుక్కమ్మ, ఈసం లాలయ్య, పూనెం లక్ష్మయ్య, మోకాళ్ల లక్ష్మయ్య, పోలెబోయిన వసంతరావు, కృష్ణ పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగరాజు

టేకులపల్లి: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకుడు గుగులోతు రామచంద్రు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జోగ నాగరాజు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సరైన బడ్జెట్ కేటాయించకుండా, ఎత్తి వేయాలని చూస్తోందన్నారు. మొబైల్ కొలతలతో సరైన కూలి పడకపోవడం వల్ల డబ్బులు సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అఖిల భారత రైతు కూలి సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రచారాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నామని, కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.750 చెల్లించాలని, మేట్లకు నెలనెలా జీతం ఇవ్వాలని, ఎఫ్ఏ, ఏపీఓలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వట్టం రమేష్, జోగ పాపయ్య, గడ్డం సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి..



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జేవీఎల్ శిరీష ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ అన్నారు. ఈ శుక్రవారం జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాట్లాడుతూ.. ఈ నెల 15న ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ యూనియన్ పబ్లిక్ హెల్త్, అండ్ మెడికల్ ఉద్యోగుల జాతీయ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు గొంగ్ల సంజీవరెడ్డి ఫొటోతో ఉన్న డైరీని కలెక్టరేట్‌లో ఆవిష్కరించారని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధం అని చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌దొర, కుమార్‌నాయక్, ఘని నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో తాగునీటి ఎద్దడి..

- అల్లాడుతున్న పేషంట్లు
- మరమ్మతులకు నోచుకోని ఫ్రిజ్


పనిచేయని ఫ్రిజ్, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డ్రమ్ము

ఇల్లెందు: నిండు వేసవిలో ఎండలు మండుతున్నాయి. చేతిలో మంచినీళ్ల బాటిల్ లేకపోతే బయటకు వెళ్లే పరిస్థితి లేదు. పావు గంటలో బాటిల్‌లో నీరు వేడెక్కిపోతున్నాయి. ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. నిత్యం వందల మంది పేషంట్లు అక్కడికి వచ్చేవారు తాగునీరు లేక అల్లాడుతున్నారు. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో మంచినీటి ఎద్దడి ఏర్పడింది. ఇక్కడి ఫ్రిజ్ మూలన పడింది. ఇక ఆర్‌ఓ ప్లాంట్ ఏళ్లుగా పనిచేయడం లేదు. బయటి నుంచి నీటిని కొనుగోలు చేసి తెచ్చి ఓ ప్లాస్టిక్ డబ్బాలో ఉంచుతున్నారు. వాటినే పేషంట్లు తాగాల్సి వస్తోంది. ఉదయం తెచ్చిన నీరు వడగాలికి వేడెక్కిపోతున్నాయి. మధ్యాహ్నం తర్వాత ఆ నీటిని తాగాలంటే మరిగించిన నీటి కంటే ఎక్కువ వేడి ఉంటున్నాయని పేషంట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ వేసవి వరకైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు. దాతలు అందజేసిన ఓ మంచినీటి ఫ్రిజ్ రెండేళ్లుగా పని చేయక మూలకు పడి ఉంది. ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేశారు. అందులోని నీరు వేడిగా ఉంటున్నాయని, తాగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు

- మండల వ్యాప్తంగా స్వైర విహారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సుజాతనగర్: మండల వ్యాప్తంగా కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామాల్లో కుక్కలు పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయి. వీటి ఆగడాలతో ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం సుజాతనగర్‌తో పాటు, గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. చిన్న పిల్లలను వెంటాడుతున్నాయి. చిన్నారుల చేతుల్లోని ఆహార పదార్థాలు లాగేసుకుంటున్నాయి. అందకుంటే వెంటబడి కరుస్తున్నాయి. శునకాల దాడితో బాధితులు టీకాల కోసం ప్రభుత్వాస్పత్రుల వద్దకు పరుగెడుతున్నారు.

జంతు వ్యర్థాల రుచి మరిగి...

గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల మాంసం వ్యర్థాలు ఊరి బయట పడేస్తున్నారు. వీటి రుచి మరిగిన కుక్కలు మనుషులు, పశువులు, పెంపుడు కోళ్లను వేటాడుతున్నాయి. రాత్రిపూట పాదచారులు, ద్విచక్ర వాహనదారులను సైతం వదలడం లేదు. కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలకు కుక్కలు అడ్డు తగులడంతో వాహనదారులు అదుపు తప్పి కిందపడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నచోట వీటి సంఖ్య అధికంగా ఉంటోంది.

పట్టించుకోని అధికారులు..

గ్రామాల్లో వీధి కుక్కల సంతతి పెరిగింది. ఏళ్ల తరబడి వీటిని అరికట్టేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శలున్నాయి. ప్రజలకు ప్రాణాపాయంగా మారిన కుక్కలపై ఏమీ చర్యలు తీసుకోవడం లేదు. ఒకటి, రెండుచోట్ల పట్టించినా వాటిని తిరిగి పక్క ఊళ్లో వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా సర్పంచులు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే సాధారణ విషయంగా పరిగణించి దాటవేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదు. సుజాతనగర్ ప్రభుత్వాసుపత్రి పరిధిలో గడిచిన మూడేళ్లలో 722 మంది కుక్క కాటుకు గురయ్యారంటే పరిస్థితికి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 2021లో 331 మంది, 2022లో 317 మంది, 2023 లో 74 మంది కుక్కకాటుకు గురయినట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.


సుజాతనగర్‌లో సంచరిస్తున్న కుక్కలు

చర్యలు తీసుకోవాలి..



సుజాతనగర్‌లో వీధి కుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నాయి. వాటిని చూస్తే ప్రజలు జంకుతున్నారు. పిల్లలు, పెద్దలు భయపడాల్సి వస్తోంది. తక్షణమే వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– బానోత్ సల్తీ, సుజాతనగర్

భయపడుతున్నాం..



గుంపులుగా కుక్కలు తిరుగుతుండటంతో భయపడాల్సి వస్తోంది. రాత్రిపూట బయటకు రావాలంటేనే వణుకు పుడుతోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, బయటకు వెళ్లే మహిళలు భయంభయంగా వెళ్తున్నారు.

– గూని శ్రీనివాసరావు, సుజాతనగర్

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేద్దాం..



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్

ఇల్లెందురూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సబ్‌డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌కో సిబ్బందికి శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో ఎక్కడ లోపం ఉందో త్వరితగతిన గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారుడి ఇంటి వరకు రక్షణతో కూడిన విద్యుత్ సరఫరా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నందున అధిక ఉష్ణోగ్రతలకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదం ఉంటుందని, ఇటువంటి వాటిని ముందే గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటే విద్యుత్ ప్రమాదాలను నిలువరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సిబ్బందితో ప్రమాణం చేయించారు. డీఈ నందయ్య, ఏడీఈలు కోటేశ్వరరావు, రాంప్రసాద్, ఎస్ఏఓ మురళి, ఏఈలు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

జూలూరుపాడు: భోజ్యా తండా గ్రామ పంచాయతీ రాజారావుపేట గ్రామం నుంచి ఒంటి బోడు శివారు వరకు గ్రావెల్ రోడ్డు మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకుడు ధరావత్ కాన్సీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... గ్రావెల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌ను గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో రాజారావుపేట నుంచి ఒంటిబోడు వరకు రోడ్డ అంతా బురదమయంగా ఉంటుందని రైతులు, కూలీలు పొలం పనులకు కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా ఉంటుందని, సమస్యను ఐటీడీఏ పీఓకు విన్నవించినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఫలించిన 'కన్నెగంటి' పోరాటం..


కృష్ణమూర్తికి నిమ్మరసం ఇస్తున్న అధికారులు

కొత్తగూడెంటౌన్: శ్రీధర్మశాస్తా ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డును తగ్గిస్తూ సింగరేణి సంస్థ భవన నిర్మాణ పనులు చేయడాన్ని నిరసిస్తూ ఆలయ కార్యదర్శి కన్నెగంటి కృష్ణమూర్తి గురువారం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఫలించింది. ఈ దీక్షకు స్పందించిన సింగరేణి అధికారులు దీక్షను చేస్తున్న కన్నెగంటి కృష్ణమూర్తి వద్దకు చేరకుని చర్చించారు. ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు 27 అడుగులు ఉండగా 22 అడుగులకు కుదించి నిర్మాణం చేయడంతో నిరాహార దీక్షకు దిగిన విషయం విదితమే. సింగరేణి అధికారులు జీఎం సూర్యనారాయణ, హనుమంతరావులు కృష్ణమూర్తితో పాటు పలువురు అయ్యప్ప భక్తులతో మాట్లాడారు. నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అధికారులు మాట్లాడుతూ... రోడ్డు వెడల్పును తగ్గించకుండా ఉన్న రోడ్డును అలాగే ఉంచుతామని తెలిపారు. వెంటనే నిర్మాణాల కోసం పునాది తీసిన కాలువలను జేసీబీతో అధికారులు పూడ్చించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వర్ధన్‌రావు, శ్రీనాథ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్‌లో బస్టాప్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కూడలిలో ఎట్టకేలకు గ్రామపంచాయతీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం బస్టాప్ ఏర్పాటు చేశారు. 'బస్టాప్ లేక జనం ఇక్కట్లు' శీర్షికతో ఈనెల 3వ తేదీన 'సమస్యల కూడలి' శీర్షికతో మండుటెండలో బస్టాప్ లేక జనం పడుతున్న ఇక్కట్లపై సాక్షిలో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సుభాష్‌నగర్ కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. బస్టాప్‌ను ఎంపీఓ చిరంజీవి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండలో బస్సుల కోసం ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే తాత్కాలిక బస్టాప్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమీపంలోనే ప్రయాణికుల కోసం చలివేంద్రం కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్, గుమస్తా కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.


బస్టాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీఓ చిరంజీవి

కంచె నిర్మాణం నిలిపివేయాలి


కంచె నిర్మాణం చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: వివాదాస్పద భూమిలో అక్రమంగా కంచె నిర్మాణం సాగుతోందని, తక్షణం అధికారులు జోక్యం చేసుకుని ఆ భూమిపై కోర్టు తీర్పు వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా చూడాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొగ్గెల రామస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ... 21 ఫిట్ తిలక్‌నగర్ ఏరియాకు చెందిన కన్నయ్య, గోపాల్‌కు మధ్య భూ వివాదం ఆర్డీఓ కోర్టు పరిధిలో ఎల్‌టీఆర్ కేసు పెండింగ్‌లో ఉందన్నారు. ఆర్డీఓ కోర్టులో పెండింగ్‌లో ఉన్నా అక్కడ ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తక్షణం అధికారులు జోక్యం చేసుకుని కేసు పరిష్కారం అయ్యే వరకు భూమిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌టీఆర్ కేసుల విషయంలో తగు ఆదేశాలు ఇవ్వాలని, కేసు నడుస్తున్నా భూమిలోకి వెళ్లిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం (గుట్ట) శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పదహారు రోజుల పండుగ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు తోలేటి నగేశ్ శర్మ, అర్చకులు ఆరుట్ల ఫణి రాజాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పుష్పయాగం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రేపు గోదావరిఖనిలో ఐఎన్‌టీయూసీ మహాసభ


మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 21న గోదావరిఖనిలో జరగనున్న ఐఎన్‌టీయూసీ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఏరియా కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని సీఆర్ క్లబ్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిఖని బృందావన్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమంలో యూనియన్ జాతీయ నాయకుడు డాక్టర్ సంజీవరెడ్డితోపాటు ఇతర నాయకులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టండి..


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ భాస్కర్‌రెడ్డి

పాల్వంచ: ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం బొల్లేరుగూడెం ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆదర్శ పాఠశాలలుగా ఉన్న 49 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ, వీఓలు, అసిస్టెంట్ ఇంజనీర్ల సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ... పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రధానంగా ఆయా పాఠశాలల్లో తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, విద్యార్థులకు తాగునీరు, వసతి, టాయిలెట్లు కల్పనకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నిధులను ఆయా పాఠశాలల పరిధిలో ఐకేపీకి చెందిన వీఓలు ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు గాను పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో ఈ పనులు సత్వరమే ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నారు.

నిబంధనలు అతిక్రమించడం వల్లే బహిష్కరణ

ఇల్లెందురూరల్: యూనియన్ నిబంధనలు అతిక్రమించడం వల్లే రాంసింగ్, ఈరెల్లి కృష్ణలను బహిష్కరించినట్లు ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ తెలిపారు. మండలంలోని పెంకు పరిశ్రమలలో శుక్రవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నలభై ఏళ్ల క్రితం ఇల్లెందు నుంచి మహబూబాబాద్ వరకు పెంకు పరిశ్రమలలో ముక్తార్‌పాషా కష్టపడి యూనియన్‌ను నెలకొల్పారని గుర్తుచేశారు. ఆయన నేతృత్వంలో కార్మికులకు అనేక హక్కులు సాధించబడ్డాయని చెప్పారు. కానీ ప్రస్తుతం యూనియన్ బాధ్యతల్లో ఉన్న రాంసింగ్, కృష్ణ నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వ సొమ్మును కాజేయడం, కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడటంతో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు వారిని యూనియన్ నుంచి బహిష్కరించినట్లు చెప్పారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: 2025లో జరగనున్న సివిల్స్ పరీక్షలకు హాజరు కానున్న మైనారిటీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులకు జామియా మిల్లియా సెంట్రల్ యూనివర్సిటీ, న్యూఢిల్లీ వారు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను జూన్ 29న హైదరాబాద్‌లో ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని, ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్‌ను బట్టి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు.